# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 24 జులై, 2024 | పేజీలు : 4


## గాంధారి మండలంలో పర్యటించిన కలెక్టర్



**ప్రజాపక్షం/కామారెడ్డి ప్రతినిధిః** గాంధారి మండలంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం పర్యటించారు. ముందుగా గాంధారి గ్రామ పంచాయతీ ఐకేపీ భవనంలో స్కూల్ యూనిఫాంల కుట్టు పనిని పరిశీలించారు. అనంతరం గాంధారి బస్టాండు దగ్గరలోని ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను పరిశీలించారు. అనంతరం బస్టాండు ఆవరణలో శానిటేషన్‌ను పరిశీలించి బస్టాండు శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు చేయించాలని డిపో మేనేజర్ కామారెడ్డి వారికి, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గాంధారి రోడ్డుకు మధ్యలో మొక్కలు నాటాలని, కార్యదర్శిని ఆదేశించారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి ఆసుపత్రిలో అన్ని రికార్డులు పరిశీలించి ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని మార్కండేయ మందిరం వద్ద మొక్కలు నాటారు. ల ఒంకతాండా గ్రామంలో వాగు బ్రిడ్జి కూలిపోవడంతో పూడిక తీత, మరమ్మతులు చేయించాలని 50 వేల రూపాయలను ఖర్చులకు అందిస్తామని ఎంపీడీఓకు, పంచాయతీరాజ్ ఏఈకి తెలియజేశారు. అదేవిధంగా గాంధారిలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించి వంటశాల గది శుభ్రంగా లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి, విజిబుల్ పోలీసింగ్‌కు, అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ప్రజా పిర్యాదుల పరిష్కారానికి విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యలతో స్టేషన్ కు వచ్చే ప్రజల ఫిర్యాదులు స్వీకరించి ఎలాంటి జాప్యం చేయకుండా వాటి పరిష్కారానికి, విజిబుల్ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.కేసుల దర్యాప్తులో, నేరస్తులను పట్టుకోవటంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సీసీ కెమెరాలను ఉపయోగించి చేధించాలని అధికారులకు సూచించారు. కేసు నమోదయిన వారం రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని స్టేషన్ అధికారులు ప్రతి రోజు పెండింగ్ కేసులను సమీక్షా జరపాలని,దర్యాప్తులో వున్న కేసుల్లో బాధితులకు వీలైనంత వరకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. డిఎస్పీ స్థాయి, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు తరచు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శింస్తూ స్టేషన్ పరిధిలో నమోదు అయ్యే నేరాలపై, తదితర అంశాలపై రివ్యూ చేయాలని ఆదేశించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీ షీటర్ల పట్ల,హిస్టరీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించడంతో పాటు వారిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సోషల్ మీడియా నిఘా ఉంచి శాంతి భద్రతలకు విఘాతం కలిగిల పోస్ట్ చేసే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో గంజాయి క్రయ, విక్రయాలు,అక్రమ రవాణాపై నిఘా ఉంచి నిర్మూలిస్తూ,యువత గంజాయి బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నేరాల చేధనలో సీసీ కెమెరాల పాత్ర ప్రజలకు వ్యాపారస్తులకు తెలియజేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటు చేసేలా అవగాహన కల్పించాలని,సిరిసిల్ల వేములవాడ పట్టణాల్లో 100 మంది కన్నా ఎక్కువ జనసంచారం ఉండే వ్యాపార ,వాణిజ్య సంస్థల్లో తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎంఫైర్స్మెంట్ యాక్ట్ లో భాగంగా సీసీ కెమెరాలు ఉండాలని,ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి తనిఖీ చేసిన సమయంలో సీసీ కెమెరాల లేకున్నా, పని చేయకున్న సంబంధిత యజమాని పై తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎంఫైర్స్మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదాలు ఎక్కువగా జరుగు ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సూచి బోర్డ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు చంద్రశేఖర్ రెడ్డి, మురళి కృష్ణ, సి.ఐ లు కృష్ణ, మొగిలి,శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మాధుకర్, శ్రీనివాస్, శ్రీలత, ఆర్.ఐ లు మాధుకర్, యాదగిరి, రమేష్, ఎస్.ఐ లు ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.




## స్థానిక సంస్థలు ఆదాయాన్ని పెంపొందించుకోవాలి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** గ్రామాలు, పట్టణాల్లో ఆదాయాన్ని మరింత పెంపొందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, ఎంపివోలు, వివిధ శాఖల అధికారులతో స్థానిక సంస్థల విధులు, బాధ్యతలపై రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సమీక్షించారు.

ఈ సంధర్భంగా రాజయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులపైనే ఆధారపడకుండా స్థానిక సంస్థలు మరింత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్థానిక సంస్థలు ఆర్థికంగా బలోపేతం అవుతేనే రాష్ట్రం, దేశం పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలు అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులను పెంచుకుంటూ ప్రగతి పథంలో పయనించాలని తెలిపారు. గ్రామస్వరాజ్యతమే దేశ స్వరాజ్యమని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులు సక్రమంగా వినియోగం అవుతున్నాయా లేదో అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించాలని , దుర్వినియోగం కాకుండా చూడాలని తెలిపారు. పక్కాగా వాటిపై ఆడిట్ నిర్వహించాలని, అన్ని రంగాలతో పాటు ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామాలు, జిల్లాలు బలంగా ఉంటేనే రాష్ట్రం, దేశం బలంగా ఉంటుందని, ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉంటుందని తెలిపారు. అధికారులు ఇచ్చిన సూచనలు సలహాలతో రాష్ట్ర ప్రభుత్వానికి ఒక మోడల్ రిపోర్టు తయారు చేసి ఇస్తామని చెప్పారు. ఆదాయం పెంపుపై కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని సూచించారు. కరీంనగర్ జిల్లాకు అన్ని అంశాలపై అవగాహన ఉన్న మంచి కలెక్టర్ పమేలా సత్పతి దొరకడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు.

## పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుంది

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందని జిల్లా ఎస్పి డివి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పదోన్నతి పొందిన పలువురు జిల్లా పోలీస్ సిబ్బందిని ఎస్పి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సర్వీస్‌లో మరిన్ని పదోన్నతులు పొందుతూ జిల్లాకు , వ్యక్తిగతంగా మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పి ఆకాంక్షించారు.

పదోన్నతులు పొందిన మహ్మద్ బషీరుద్దీన్, గులాం మక్సుద్ అహ్మద్, నాగురాజు, తిరుపతిలను అభినందించారు. మహ్మద్ బషీరుద్దీన్, గులాం మక్సుద్ అహ్మద్ హెడ్‌కానిస్టేబుల్ నుండి ఎఎస్‌ఐగా, నాగురాజు, తిరుపతి కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారని తెలిపారు. మహ్మద్ బషీరుద్దీన్ 2019లో తెలంగాణ హైకోర్టులో ఆసిఫాబాద్ జిల్లాలో తరపున కోర్ట్ లిజనింగ్ ఆఫీసర్‌గా రెండు సంవత్సరాలు విధులు నిర్వర్తించారన్నారు. తర్వాత జిల్లాలో ఆసిఫాబాద్ డిస్ట్రిక్ కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లిజనింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ 15 కేసులలో 20 మంది నేరస్థులకు జీవిత కారాగార శిక్ష పడే విధంగా కృషిచేసినందుకు గాను వారు ప్రశంసాపత్రం పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ టౌన్ సిఐ సతీష్, కాగజ్‌నగర్ రూరల్ సిఐ రాంబాబు, ఆర్ఐ అడ్మిన్ పె ద్దయ్య, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు ఎంవిఎస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# వ్యాపార సంస్థలు విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నగరపాలక సంస్థ పరిధిలోని వ్యాపారులు ప్రతిఒక్కరూ విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ గంగిశెట్టి రాజేంద్రకుమార్ అన్నారు. గత 15 రోజులుగా ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్న డిప్యూటీ కమీషనర్‌ను ప్రజాపక్షం విలేకరి కలిసి స్పందనను అడిగి తెలుసుకుని మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలోని వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్స్‌తో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రాపర్టీ టాక్స్‌లు రీహెనన్స్ చేయాల్సి ఉందన్నారు. గతానికి, ప్రస్తుతానికి వ్యాపార సముదాయాలు వ్యాపార విస్తరణకు పలుమార్లుపు చేసి ఉన్నందున ఆయా సంస్థల ప్రాపర్టీ ట్యాక్స్‌ను పెంచాల్సి ఉందన్నారు. వ్యాపార సంస్థలు ప్రారంభానికి ముందే ట్రేడ్ లైసెన్స్ ప్రాపర్టీ ట్యాక్స్, పరిసరాల పరిశుభ్రత సానిటేషన్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకున్న అనంతరం వ్యాపారాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. లేని యెడల వ్యాపార సంస్థ ఆరంభించిన 90 రోజులలోగా 25 శాతం ఫెనాల్టీతో 90 రోజు అనంతరం 50 శాతం ఫెనాల్టీతో లైసెన్స్‌లు జారీ చేయబడుతాయన్నారు. ఆకస్మిక దాడులతో నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఆహారం అందనుందన్నారు. వీటి వల్ల కార్పొరేషన్‌కు ఆదాయం పెరగటంతో పాటు ప్రజాధనంను కాపాడినట్లు అవుతుందన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం అన్ని నగరపాలక సంస్థల ఆధ్వర్యంలో తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇచ్చేలా ప్రజలకు బకెట్లను పంపిణీ చేశామని, ప్రజల సహాయ సహకారాలతో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచటానికి సహకరించాలని కోరారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌ను వాడరాదని నిర్ణయించుకుని తమ తమ అవసరాల కోసం చేతి సంచులను (గుడ్డ సంచులు) వాడేలన్నారు. దీంతో ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గి భూగర్భజలాలు, మురుగు కాలువల నిర్వహణ సులభమవుతుందన్నారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలి

**ప్రజాపక్షం/బుగ్గారం:** బుగ్గారం మండల కేంద్రంలో మంగళవారం రోజున ఎంపివో అఫ్జల్ మియా, గ్రామ పంచాయితీ సెక్రటరీ అక్బర్ గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుభ్య కార్మికులతో బుగ్గారంలోని వాడ వాడలా తిరుగుతూ అపరిశుభ్రత ఉన్న దగ్గర బ్లీచింగ్, అంటీ బయోటిక్స్ స్ప్రే చేయించారు. కలుపు మొక్కలు, గడ్డి మొక్కలు పెరిగిన దగ్గర దోమలు పెరగకుండా ఉండేందుకు ఆంటీ లార్వా స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా అఫ్జల్ మియా మాట్లాడుతూ ప్రజలు వారి ఇంటి ఆవరణలో చుట్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చేసుకోవాలని, వర్షాకాలంలో ఎక్కువ ఈగలు, దోమల వల్ల రకరకాల జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని, కావున సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అక్బర్, కార్మికులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌ను సందర్శించిన ప్రత్యేక న్యూఢిల్లీ బృందం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జీజీహెచ్‌లో హెచ్ఐసీసీ ద్వారా సమీక్షలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా ఆస్పత్రి సేవలు భేష్ అని కేంద్ర బృందం వైద్యులు పార్థసారథి అన్నారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఢిల్లీ కేంద్ర ప్రభుత్వం సందర్శించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా 185 క్షయ వ్యాధి నిర్మూలన కేంద్రాలలో నిజామాబాద్ ఒకటని, అందుకే ఇక్కడికి రావటం జరిగిందన్నారు. నిజామాబాద్ జీజీహెచ్‌లో క్షయ వ్యాధి నిర్మూలనపై తగిన చర్యలపైన సమీక్ష నిర్వహించామని డాక్టర్ ప్రతిమారజ్ అన్ని రకాల నియంత్రణ చర్యలను పాటిస్తున్నట్లు మా దృష్టికి రావటం జరిగిందని, ముఖ్యంగా సిబ్బందికి వ్యాక్సినేషన్ ఏర్పాటు చేయటం ప్రతివారం హెచ్ఐసీసీ ద్వారా సమీక్షలు నిర్వహించటం అభినందనీయమన్నారు. జీజీహెచ్‌కు విచ్చేస్తున్న రోగులకు క్షయ (టిబి)పై అవగాహన కల్పించేలా సూచనలు చేయాలన్నారు. డాక్టర్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ న్యూఢిల్లీ నుండి కేంద్ర బృందం రావటం ప్రభుత్వ ఆస్పత్రులలో గాలి ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణపై బృందం ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నామన్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు వైద్యులు పార్థసారథి, భరత్‌కుమార్, ప్రమోద్‌రెడ్డి, జీజీహెచ్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో వన మహోత్సవం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్ కుమార్ విద్యార్థులు ఇంటి వద్ద నుండి తీసుకువచ్చిన మొక్కలను ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ మాట్లాడుతూ మొక్కల వలన మానవులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, నేటి మొక్కలు కాబోయే రోజుల్లో అతి పెద్ద వృక్షాలుగా తయారై మానవులకు నీడతో పాటు ఆక్సిజన్ ఇచ్చి కాపాడతాయన్నారు. అదే విధంగా మొక్కల వలన వర్షాలు అతిగా కురిసి పంటలు బాగా పండుతాయని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో చెట్లను పెంచుకుని పరిసరాల పరిశుభ్రతకు పాటు పడాలన్నారు. యావత్ ప్రపంచం వృక్షాలపై ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి మన భూమాతను పర్యావరణం కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కే. నాగేష్, ఉపాధ్యాయులు రవికుమార్, రాకేష్, ప్రవీణ్ కుమార్, పున్నం చందర్, అభిషేక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పచ్చదనం వెల్లి విరియాలి...

**ప్రజాపక్షం/బాన్సువాడ :** మొక్కలను మొక్కుబడిగా నాటడమే కాకుండా వాటిని వృక్షాలుగా మారేంతవరకు పరిరక్షించే బాధ్యత మన అందరిపై ఉందని మండల ప్రత్యేక అధికారి ఆర్‌డివో రమేష్ రాథోడ్ మంగళవారం బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో పారిశుద్య పనులను ఆయన పరిశీలించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆయన పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటి నీరుపోశారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో తప్పనిసరి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడివో బషీరోద్దీన్, ఎపివో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన దరఖాస్తులకు మోక్షం లభించేనా...



**ప్రజాపక్షం/ఎండపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు ఎంపికకు ప్రజాపాలన పేరుతో గత ఏడాది డిసెంబర్ నెల 28 నుండి ఈ ఏడాది జనవరి 6 వరకు గ్రామ సభల ద్వారా ప్రజల నుండి దరఖాస్తులను గ్రామసభల్లో అధికారులు దరఖాస్తులు తీసుకుని, దరఖాస్తులకు అధికారులు రసీదు కూడా ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా, ప్రజా పాలనలో ఆరు గ్యారంటీల పథకాలకు అవసరమైన విధంగా ప్రజలు వాటికి సంబంధించిన వివరాలను దరఖాస్తులో పొందుపర్చారు. అర్హులైన లబ్దిదారుల కోసం ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న సమయంలో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా అందడం లేదనే వాదన ఉంది. మండలంలో చాలా వరకు వంట గ్యాస్, గృహజ్యోతికి సంబంధించిన జీరో విద్యుత్ బిల్లులు రావడం లేదని వంట గ్యాస్‌కు సంబంధించిన, ఆప్ నమోదులో కూడా తప్పులు నమోదు కావడం చేత కొంత మంది అర్హులు 500 గ్యాస్ కోల్పోతున్నామని మదన పడుతున్నారు. మండల కార్యాలయాలకు వెళ్లి విచారణ చేయగా త్వరలోనే సవరణకు ఆప్షన్ వస్తుందని చెప్పడం కొసమెరుపు. ప్రజాపాలనలో దరఖాస్తు సమర్పించిన కొంత మంది వారి డాటా కనిపించడం లేదని వాపోతున్నారు. ప్రజా పాలనకు సంబంధించి అంతర్జాలంలో వివరాలు కనిపించకపోవడంతో రశీదులు చూపిస్తూ, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక మనో వేదనకు గురవుతున్నారు. అయితే డాటా ఎంట్రీ తప్పిదాల వల్ల కొంత మంది అర్హులు, మహాలక్ష్మిలో భాగం అయిన వంట గ్యాస్, గృహజ్యోతి, పథకాలు కొరకు దరఖాస్తు చేసుకున్నా దరఖాస్తు ఫారాలు ఎంట్రీ చేసేటప్పుడే కంప్యూటర్ ఆపరేటర్‌ల నిర్లక్ష్యం కారణంగా పథకాలు కోల్పోయామని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఉన్నత అధికారులు స్పందించి ప్రజా పాలన దరఖాస్తులో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుని అర్హులైన లబ్దిదారులకు ఆరు గ్యారంటీలు అందించేలా చర్యలు చేపట్టాలని, దరఖాస్తు చేసుకున్న డాటా అందుబాటులో లేని వారికి మళ్లీ అవకాశం కల్పించాలని, ఇది వరకే చేసుకున్న వారికి సవరణకు అవకాశం కల్పించి, పథకాలను అర్హులైన వారందరికి అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## మృతిచెందిన కొమురయ్యకు పలువురి నివాళి

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన గంగారం కొమురయ్య అనారోగ్యంతో వరంగల్ ఎంజిఎం హాస్పిటల్‌లో సోమవారం రాత్రి మృతి చెందగా విషయం తెలుసుకున్న తెలంగాణ కురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ వెళ్లి కొమురయ్య మృతదేహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. అధే విధంగా తమ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి దుఃఖంలో ఉన్నవారికి ధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో కొడిపాక కృష్ణమూర్తి గంగార రమేష్, రామ్మూర్తి గంగారం, రాజు, రామ్‌చందర్, తిరుపతి తదితరులున్నారు.

## ముఖ్యమంత్రి, సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/నందిపేట్:** నందిపేట్ మండలంలోని చౌడమ్మ కొండూరు గ్రామంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసినందుకు ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పిలుపుమేరకు కొండూరు గ్రామ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ, ముఖ్యమంత్రిల చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డిసిసి డెలిగేట్ సామల దేవిదాస్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేతిరి గంగసాయిలు, పోశెట్టి, జె దేవిదాస్, ఎల్. శ్యాంరావు, గుండ్ల సురేష్, ఎర్రమలకు వంజర్, లింగోజి, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం బస్సు నడపాలి



**ప్రజాపక్షం/నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో పలుగుట్ట సమీపంలో కొనసాగుతున్న మోడల్ స్కూల్ కస్తూర్బా గాంధీ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం బస్సు నడపాలని కోరుతూ మంగళవారం ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ జానిరెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ వినతి పత్రం అందజేశారు. అలాగే నందిపేట్ నుండి నిజామాబాద్‌కు రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని, రాత్రి 10.30 గంటలకు నిజామాబాద్ నుండి నందిపేట్‌కు బస్సు నడపాలని కోరారు. నందిపేట్ నుంచి తెల్లవారుజామున హైదరాబాద్‌కు బస్సు రాకపోకలు పునరుద్ధరించాలని కోరారు.

## పారిశుద్ధ్య కార్మికుల బదిలీలు ఆపాలి



**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి :** నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికుల బదిలీల పేరుతో ఆందోళన గురి చేస్తున్నారని ఆ ప్రయత్నాన్ని తక్షణమే పాలని కోరుతున్నామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. మంగళవారం ఉదయం ఎఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడా లేని పద్ధతిలో కార్యాలయంలో పని చేసే సిబ్బందిని బదిలీ చేయాలి గానీ నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు బదిలీ చేస్తామనటం సరి కాదన్నారు. అనేక సంవత్సరాలుగా సీనియార్టీ ప్రకారం కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలని, స్పెషల్ ఇంక్రీమెంట్ ఇవ్వాలని, రెగ్యులర్‌గా రావల్సిన సబ్బులు, చెప్పులు, నూనెలు యూనిఫారాలు ఇవ్వాలని అడుగుతుంటే ఇవ్వకుండా పారిశుధ్య కార్మికుల బదిలీ ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.నర్సంగ్‌రావు, నాయకులు నర్సయ్య, ఒడ్డెమ్మ, చిన్నసాయమ్మ, రజిని, రాజేందర్, కార్మికులు పాల్గొన్నారు.

## కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసినమోడీ ప్రభుత్వం



**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మళ్లీ నిరాశనే మిగిల్చిందని తెలంగాణపై కేంద్రానికి ఉన్న నిర్లక్ష్యాన్ని మోడీ ప్రభుత్వం చూయించిందని రాష్ట్రం నుండి ఇద్దరు కేంద్రంలో సహాయక మంత్రులుగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి నిధులు తేవడంలో విఫలమయ్యారని తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపురి అరవింద్ 5 సంవత్సరాలు ఎంపీగా ఉండి ఇప్పుడు మళ్లీ ఎంపీ అయిన కూడా తన ప్రవర్తనలో ఆలోచనలో మార్పు రాలేదని, తెలంగాణ నుండిబీజేపీకి నలుగురు ఉన్న ఎంపీలు రెట్టింతలు అయి ఎనిమిది మంది అయిన కూడా రాష్ట్రానికి నిధులు రాకుండా రాష్ట్రాన్ని ఎనిమిది ఇంతలు మోసం చేశారన్నారు. ఇ ది రాష్ట్రపైన కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తచూపుకు నిదర్శనమన్నారు.

# ఉపాధిహామీ పథకం రద్దు చేసే దిశగా కేంద్ర బడ్జెట్

ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే దిశగా కేటాయింపులు జరిగాయని భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెయంయు) రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలను ఆదుకోవడంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని, ఇలాంటి పథకాలకు అరకొరగా కేవలం రూ.88 వేల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించడం సాధ్యం కాదని, ఉపాధి హామీ పథకం లక్ష్యం నెరవేరదన్నారు. సంపన్నుల కోసం పనిచేసే నరేంద్ర మోడీ ప్రభుత్వం చర్యల వల్ల ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం కొన ఊపిరిలో ఉందని, ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసుకుని ఉపాధి కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ కేటాయింపులు జరపాలని సృజన్ కుమార్ హితవు పలికారు.



## పదేళ్లపాలనలో బిజెపి బిసిలకు చేసిందేమిటో చెప్పాలి




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బిసిలకు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని చేసిన వ్యాఖ్యలను కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఓబిసి సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు ఖండించారు. మంగళవారం డిసిసి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో కుల జనగణన ఎందుకు చేపట్టలేదో వివరణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రామిడి రాజిరెడ్డి, లింగంపల్లి బాబు, నూనె గోపాల్ రెడ్డి, ఎస్‌కె సిరాజ్ హుస్సేన్, పోతుగంటి శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులున్నారు.

## ఏపికి నిధుల వరద.. తెలంగాణ ముఖాన బురద

ప్రజాపక్షం/చిగురుమామిడిః కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణలో కేటాయింపులపై రాష్ట్ర హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి స్పందించారు. తెలుగు కోడలు నిర్మలా సీతారామన్ తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్‌లో ఆశలు పెట్టుకుంటే దక్కింది శూన్యమన్నారు. రూ.48 లక్షల ఇరవై ఒక్క వేల కోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారని ఆయన ఆరోపించారు. బడ్జెట్‌లో తెలంగాన ఊసే లేదని, అసలు మొత్తం బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రానికి మరోసారి దక్కింది గుండుసున్నానే అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టంలో హామీలను అమలు పరచలేదన్నారు. 8 మంది ఎంపిలను ఇచ్చినా బిజెపి ప్రభుత్వం తెలంగాణకు గుండుసున్నా నిధులు ఇచ్చినందుకు తెలంగాణ ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ మానేరుకు ఉత్తమ అవార్డులు

ప్రజాపక్షం/కరీంనగర్ః లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ మానేరు సేవలకు ఉత్తమ అవార్డులు లభించాయి. లయన్స్ ఇంటర్నేషన్ డిస్ట్రిక్ట్ 320 జి కరీంనగర్‌లో జరిగిన సేవకు సత్కారం మహాసభలో 202324 లయనిస్టిక్ సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ మానేరుకు 320జి, మల్టీపుల్ యందు బెస్ట్ మెంబర్‌షిప్ గ్రోత్ అవార్డు లభించింది. ఈ మేరకు మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి, ప్రస్తుత 320జి గవర్నర్ లయన్ నడిపెల్లి వెంకటేశ్వర్ చేతుల మీదుగా అవార్డును, ట్రోఫీని అందజేశారు. అదే విధంగా బెస్ట్ ప్రెసిడెంట్‌గారాజశేఖర్, బెస్ట్ సెక్రటరీగా వరాల జగన్, బెస్ట్ ట్రెజరర్‌గా మహమ్మద్ అక్బర్‌లకు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విడిజి1 లయన్ సింహరాజు కోదండరాములు, భద్రేశం,పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల కోసం బిజెపి నాయకులు సన్నద్ధం

ప్రజాపక్షం/గంగాధరః బిజెపి నాయకులు, కార్యకర్తలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో మంగళవారం మండల బిజెపి కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు కోల అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలులో పూర్తిగా విఫలమయ్యిందన్రాడు. రోజుకో హామీ.. పూటకో మాట మాట్లాడుతూ లబ్దిదారులకు పూర్తిస్థాయిలో పథకాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. రైతులను, మహిళలను, నిరుద్యోగులను మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పెరక శ్రావణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీపతి చంద్రశేఖర్, జిల్లా బిజెవైఎం ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి శశిధర్ రెడ్డి, దళిత మోర్చ జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్, దాసరి ఆంజనేయులు, తిరుపతి, లక్ష్మ ణ్, పరశురాం తదితరులున్నారు.

## విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలి




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి అని పి.డి.ఎస్.యు నిర్మల్ జిల్లా అధ్యక్షులు సింగారి.వెంకటేష్ డిమాండ్ చేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు వచ్చిన విద్యారంగాన్ని గాలికి వదిలేస్తున్నారని తెలిపారు.కొఠారి కమిషన్ సూచించినట్టు విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించినప్పుడే విద్యారంగం అభివృద్ధి చెందుతుందని అన్నారు.అదేవిధంగా,జూనియర్ కళాశాలలో తక్షణమే మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నూతన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 8000 కోట్ల స్కాలర్షిప్లను విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. ప్రవేట్ పాఠశాలల్లో నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో, నరేష్, రాజ్, రంజిత్, నవీన్, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కుంగ్ ఫు పోటీల్లో ఐపిఎస్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ




ప్రజాపక్షం/సుల్తానాబాద్ః సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ కుంగ్ ఫు పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు.ఈ నెల 21వ తేదీ ఆదివారం హైదరాబాదులో జరిగిన ఫస్ట్ అంతర్జాతీయ కుంగ్ ఫు చాంపియన్ షిప్ పోటీల్లో జి రిషి వర్ధన్ సాండ విభాగంలో బంగారు పథకం సాధించగా జి హర్ష వర్ధన్ సాండా, ఫార్మ్స్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు.ఐపీఎస్ పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ వలన మంచి క్రమశిక్షణ ఏర్పడుతుందని తమ స్వీయ రక్షణకు,ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహద పడుతుందని అన్నారు.

## సిరిసిల్ల రాజయ్యను కలిసిన పురుమల్ల శ్రీనివాస్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో 2024 ఆర్థిక సంవత్సరంపై ఆర్థిక శాఖ అధికారులతో నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్, మాజీ ఎంపి సిరిసిల్ల రాజయ్యను కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్ మంగళవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్‌లో ఎంపిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో పార్లమెంటులో గళమెత్తిన సిరిసిల్ల రాజయ్య నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్‌లో సేవకునిగా పనిచేస్తూ అధిష్టానం ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ బాధ్యతలు స్వీకరించడం పట్ల అభినందనలు తెలియజేశారు. ఆయనను కలిసిన వారిలో శ్రీనివాస్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. సిరాజ్ హుస్సేన్, శ్రీకాంత్ తదితరులున్నారు.

## పోతారంలో ఉచిత హోమియో వైద్య శిబిరం

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లోని పోతారం గ్రామంలో హోమియో వైద్యశాల డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్ నెత్తెట్ల మహేందర్ యాదవ్, తోపాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి జైపాల్, వివిధ పార్టీల నాయకులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.అనంతరం హోమియో వైద్యాలు శ్రీవాణి బదిలీపై వెళ్తున్న సందర్భంగా మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామపంచాయతీ కార్యదర్శి జైపాల్ తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ శ్రవణ్, సి ఏ కోటగిరి జోష్నా తోపాటు తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాణి, ఉన్నారు.

## ఆలయ ఉద్యోగుల బదిలీలు ఆపండి



ప్రజాపక్షం/వేములవాడ : నేడు అసెంబ్లీలో రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, రాంచందు నాయక్, బీర్ల ఐలయ్య ను కలిశారు. రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు నేతృత్వంలో మంగళవారం రోజు అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాంచందు నాయక్, బీర్ల ఐలయ్య ను కలసి రాజన్న కండువా కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.వీరి వెంట రాజన్న ఆలయ ఉద్యోగులు పర్యవేక్షకులు నటరాజు, నాగుల మహేష్,గుండి నరసింహ మూర్తి ,సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ,సురేష్,గడ్డం రాజేందర్,నక్క తిరుపతి ఉన్నారు.

## కట్ట మైసమ్మకు బోనాలు సమర్పించిన వాకర్స్ అసోసియేషన్



ప్రజాపక్షం/తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ కట్టమైసమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపల్లి ఆనందం, సభ్యులు గజభీంకార్ రాజన్న మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని శ్రీ కట్ట మైసమ్మ తల్లికి ఎంతో భక్తి శ్రద్ధలతో కొలుస్తూ సమాజ హితం కోరి ప్రతి సంవత్సరం బోనాల పండుగను నిర్వహిస్తున్నామని అన్నారు. ఆ కట్ట మైసమ్మ తల్లి చల్లని దీవెనలు ప్రజలపై ఉండాలని, పాడిపంటలు, వ్యాపారాలు, చేతువృత్తులు ,ఇలా వివిధ రంగాలు లాభసాటిగా సాగాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో,గడపాలని కోరుకున్నట్లు వాకర్స్ అసోసియేషన్ సంఘం సభ్యులు తెలిపారు.

## అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చిందని బిజెపి సీనియర్ నాయకులు పొల్సాని సుగుణాకర్‌రావు పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ.1.53 లక్షల కోట్లు కేటాయింపు చేయడం గొప్ప విషయమన్నారు. ఉత్పాదకత, ప్రకృతి వ్యవసాయ పెంపు, సూక్ష్మ , మధ్యతరగతి పరిశ్రల క్రెడిట్ గ్యారెంటీ పథకం, ఉద్యోగస్తులకు, ఆదాయ వర్గాల వారి లాభానికై వార్షిక ఆదాయం స్లాబులను పెంచిందన్నారు. పేదలకు మూడు కోట్ల ఇళ్లను ఆవాస్ యోజన కింద నిర్మాణం చేయనుందన్నారు. ముద్ర లోన్‌ను రూ.20 లక్షలకు పెంచిందన్నారు. గ్రామీణ అభివృద్ధికి రూ.2.66 లక్షల కోట్లను కేటాయించిందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్లను కేటాయించిందన్నారు. యువత ఇంటర్న్‌షిప్‌కు నిధులను కేటాయిస్తూ వర్కింగ్ ఉమెన్స్ కు హాస్టల్ ఏర్పాటు లాంటి చర్యలతో దేశం అభివృద్ధి వేగం పెరగనుందన్నారు. అదే విదంగా పేద ,మధ్యతరగతుల ప్రజల సంక్షేమానికి ఈ బడ్జెట్ ప్రాధాన్యతనిచ్చిందన్నారు.

## బాధిత కుటుంబాలకు కొత్త శ్రీనివాస్‌రెడ్డి పరామర్శ

ప్రజాపక్షం/చిగురుమామిడిః మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన గోగూరి మురహరి రెడ్డి తల్లి గోగూరి పోచమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు మామిడి అంజయ్యతో కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారికి మనోధైర్యాన్నిచ్చారు. అనంతరం చిగురుమామిడి మండల కేంద్రంలోని ముడికె ఐలయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. వారి వెంట రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, సీతారాంపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్యామకూర సంపత్ రెడ్డి, నాయకులు ముస్కుల సుధాకర్ రెడ్డి, ముస్కుల కృష్ణారెడ్డి, ఒంటెల ఇంద్రసేన రెడ్డి, ముసాపురి అశోక్, ముక్కెర సదానందం, అనిల్, శ్రీకాంత్ తదితరులున్నారు.

# వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

ప్రజాపక్షం/జమ్మికుంట: కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం వికసిత భారత లక్ష్యంగా పనిచేస్తుందని, దానికనుగుణంగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు అందగా కేంద్ర బడ్జెట్ రూపొందించారని కితాబిచ్చారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను రాజు చేయాలనే ఉద్దేశ్యంతో వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి



బడ్జెట్లో పెద్దపీట వేయడం జరిగిందని సంతోషించారు. మహిళా సాధికారత దిశగా మహిళలను ప్రోత్సహించడం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపారని, బడ్జెట్‌లో మహిళలకు అత్యధిక నిధులు కేటాయించడం దానికి నిదర్శనమన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, మానవ వనరుల అభివృద్ధి, సామాజిక న్యాయం, ఉత్పత్తి సేవలు, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక వసతులు, పరిశోధన అభివృద్ధి , దీని ద్వారా నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట వేసిన ప్రభుత్వంగా చరిత్రలో నిలుస్తుందని సంపత్ రావు అన్నారు. ఈ బడ్జెట్‌ను దేశ ప్రజలు సంతోషంగా స్వాగతిస్తున్నారని తెలిపారు.

## బొగ్గుగని కార్మికులకు మొండిచేయి

ప్రజాపక్షం/నస్పూర్ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 202425 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్‌లో బొగ్గుగని కార్మికులకు ఇన్కమ్ టాక్స్ స్లాబుల పేరిట మొండి చేయి చూపించిందని టిబిజికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ప్రకటనలో ఆరోపించారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన కార్మికుల నుండి 15 నుండి 20 శాతం ఇన్కమ్ టాక్స్, సీనియర్ కార్మికులకు 30 శాతం కంటే ఎక్కువ ఇన్కమ్ టాక్స్ స్లాబ్‌లో వీరి జీతాలు ఉండటం వలన సంవత్సరానికి 3 నుండి 4 న ఎలల జీతాలను టాక్స్ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నారని పేర్కొన్నారు.ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కోల్‌బెల్ట్ ప్రజాప్రతినిధులు సింగరేణి ఉద్యోగులకు ఎలక్షన్ ముందు ఇచ్చిన ఆర్థికపరమైన హామీలను అమలు చేయాలని, ఇన్కమ్ టాక్స్ పూర్తిగా రద్దు చేయాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘంగా డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.

## నమలిగుండు పల్లె సిఎం సహాయనిధి చెక్ పంపిణీ

ప్రజాపక్షం/వేములవాడ రూరల్: వేములవాడ రూరల్ నమిలిగుండు పల్లె గ్రామంలో ఈరోజు సీఎం సహాయనిధి నుండి గడిపెల్లి మనిషా కు చెక్ అందజేయడం జరిగింది. రూలర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాకులాభరణం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రజలకు సహాయం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి గారికి, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగు వెంకటేష్, నమలిగుండుపల్లి మాజీ సర్పంచ్ వంగపల్లి మల్లేశం, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కల్లపల్లి తిరుపతి, కిసాన్ సెల్ అధ్యక్షులు వల్లంపట్ల కనకయ్య, సజ్జన్ సాగర్, మహేష్, ఇన్నారం సాగర్, తిరుపతి పాల్గొన్నారు.

## సామాజిక వర్గాల సంక్షేమాన్ని మరిచిన కేంద్ర బడ్జెట్

ప్రజాపక్షం/కరీంనగర్: దేశంలో 10 కోట్ల మంది ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం శోచనీయమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ అన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ 6660 కోట్ల రూపాయలు కేటాయించం విద్యార్థులను చదువులకు దూరం చేయడమేనన్నారు. పసి పిల్లలందరికీ పౌష్టికాహారం అందిస్తామంటూనే మధ్యాహ్న భోజన పథకానికి గత సంవత్సరం కేటాయించి 21527 లక్షల కోట్ల బడ్జెట్ నుంచి 21200 లక్షల కోట్లకు కుదించడం చూస్తే కేంద్ర ప్రభుత్వానికి సామాజిక వర్గాల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదనేది అర్థమవుతుందన్నారు.

## రైతు రుణమాఫీ కాని వారు మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలి



ప్రజాపక్షం/జైపూర్ : మొదటి విడత లక్ష రూపాయల రుణమాఫి కాని వారు మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కాంగ్రెస్ నాయకులు, జైపూర్ మాజీ ఎంపిటిసి లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండు లక్షల రుణ మాఫి పథకంలో భాగంగా మొదటి విడతగా ఒక లక్ష రూపాయలు మాఫికి సంబంధించిన రైతు వివరాలతో కూడిన లిస్టును ప్రభుత్వం విడుదలు చేసిందని తెలిపారు. రైతులు మండల వ్యవసాయ కార్యాలయానికి వచ్చేటప్పుడు తమ వెంట బ్యాంకు బుక్, ఆధార్‌కార్డు, పట్టా పాస్‌పుస్తకం తీసుకురావాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ రైతుకు రెండు లక్షల రుణమాఫి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. అదే విధంగా మండలంలోని రైతులు గతంలో రైతు భీమా పథకంలో పేరు నమోదు చేసుకోని వారు ఆగస్టు 5 లోపు భీమా పథకంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి కొమురయ్య, రైతులు పాల్గొన్నారు.

## వానాకాలంలో పంటల్లో ఎరువుల యాజమాన్యంపై అవగాహన



ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ : కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రొఫెసర్ జయ శంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటి శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమంల నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మహదేవప్ప, డా.బి.రాంప్రసాద్,కె. కిరణ్ బాబు వానాకాలల పంటల్లో ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరారు. పత్తి పంటలో వచ్చే తెల్లదోమ, పచ్చదోమ, తామర పురుగు నివారణ, పత్తిలో గులాబి రంగు కాయ తొలుచు పురుగు నివారణ, కాండంనకు మందు పూత పద్దతి, పొగాకు, లద్దె పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు సృజన, యువరాణి, శైలేష్, రోహిణి, రైతులు పాల్గొన్నారు.

## ఆగ్రో సేవలను రైతులు వినియోగించుకోవాలి...



ప్రజాపక్షం / బాన్సువాడ: రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ద్వారా అందుతున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. హైదరాబాదులోని రాష్ట ఆగ్రో ఇండస్ట్రీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఆగ్రో మేనేజర్ల సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్ కాసుల బలరాజు మాట్లాడుతూ ఆగ్రో సంస్థల మేనేజర్లు రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పంటలపై వారికి అవగాహన కల్పిస్తూ ఆగ్రో ఇండస్ట్రీస్ నుంచి లాభాల బాటలో నడిపించాలన్నారు. గత ప్రభుత్వంలో రైతుబంధు ఇచ్చి రైతాంగానికి అందించాల్సిన సబ్సిడీలను ఎత్తివేసి వ్యవసాయ రంగాన్ని పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమ అభివృద్ధి కోసం పనిచేస్తుందని, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు సబ్సిడీపై అందించాల్సిన విత్తనాలు, పనిముట్లు తదితర అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్ళి రైతులను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించి ఆగ్రో ఇండస్ట్రీస్‌ను లాభాల బాటలో నడిపిద్దామని ఆయన మేనేజర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆగ్రోస్ ఎండి. రాములు, మేనేజర్ మధుసూదన్, మల్లికార్జున్, రీజినల్ మేనేజర్ వెంకన్న, ఆయా జిల్లాల ఆగ్రో మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ టైక్వాండో అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడిగా యాదయ్య

ప్రజాపక్షం/జమ్మికుంట: మార్షల్ ఆర్ట్స్‌లో 41 సంవత్సరాల అనుభవం ఉన్న జమ్మికుంటకు చెందిన సీనియర్ కరాటే మాస్టర్ సుంకరి యాదయ్యను తెలంగాణ రాష్ట్ర టైక్వాండో జయంత్ రెడ్డి ఇంటర్నేషనల్ టైక్వాండో హెడ్ క్వార్టర్స్ కొరియా అనుబంధంగా ఉన్న అకాడమీ అధ్యక్షుడిగా , కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ జయంత్‌రెడ్డి ఇంటర్నేషనల్ టైక్వాండో అకాడమీ అధ్యక్షుడు జయంత్ రెడ్డి తెలిపారు. మాస్టర్ సుంకరి యాదయ్య తెలంగాణ అన్ని జిల్లాల్లో టైక్వాండో ఇన్స్ట్రక్టర్లను నియమించేందుకు అర్హత పొందారని పేర్కొన్నారు. మార్షల్ ఆర్ట్ స్ఫూర్తిని నిలబెట్టే బాధ్యతతో పనిచేయాలని ఆయన సూచించారు. రాష్ట అధ్యక్షుడిగా నియామకమైన సుంకరి యాదయ్యను షీ టీం రుద్రమదేవి, సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మి, రవి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో నియామక పత్రాలు అందజేసినట్లు సుంకర యాదయ్య తెలిపారు.

## గుంతల మయమైన మార్కెట్ ప్రధాన రహదారి



ప్రజాపక్షం/మంచిర్యాల: గత నాలుగైదు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న చిరుజల్లులతో ప్రధాన రహదారి గుండా మార్కెట్‌కు వచ్చే రహదారి అంతా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు, పాదాచారులు బురదలో గుంటలలో పడిపోవడం జరుగుతుంది. సంబంధిత మున్సిపల్ అధికారులు గానీ , సింగరేణి అధికారులు గానీ వాటిని పూడ్చివేసే చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ఇలాగే ఈ చిరుజల్లులు కొనసాగితే మార్కెట్‌కి వచ్చే రహదారి పూర్తిగా పాడైపోయే ప్రమాదం ఉందని పలువురు వ్యాపారస్తులు తెలుపుతున్నారు.

## కార్పొరేట్ స్థాయి పర్యావరణపై అవగాహన



ప్రజాపక్షం/మందమర్రి : మందమర్రి జిఎం కార్యాలయ పరిధిలో మంగళవారం కార్పొరేట్ స్థాయిలో పర్యావరణపై అవగాహన సమావేశాన్ని స్థానిక జిఎం ఎ మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిఎం పనిచేస్తున్న జెవిఎల్ గణపతి పాల్గొన్నారు. సింగరేణి పర్యావరణ అనుమతులు చట్టాల గురించి పలు రకాల సింగరేణి విధానాల గురించి సింగరేణి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిపిస్తూ డ్రై డే

ప్రజాపక్షం/వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని 9, 12 వార్డులో డ్రైడేలో భాగంగా మంగళవారం మున్సిపల్, వైద్య సిబ్బంది సంయుక్తంగా ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని పారబోసి, దోమల లార్వా వృద్ధి చెందకుండా చూసుకోవాలని, ఇంటి యజమానులకు తెలిపారు. నిల్వ ఉన్న నీటిని పారబోసిన మున్సిపల్ సిబ్బంది. దోమలు వృద్ధి చెందుతే డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, రాబోవు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది, వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ లావణ్య, ఏఎన్ఎం సృజన, ఆర్పి మహేశ్వరి, ఆశా వర్కర్ జ్యోతి, మున్సిపల్ సిబ్బంది పిట్టల రాజు, కంటయ్య, చిలుక అంజయ్య, రష్మా పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి



ప్రజాపక్షం / చందుర్తి : కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరో సారి మొండి చేయి చూపించిందని చందుర్తి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బిజెపికి ఎనిమిది సీట్లు ఇచ్చినా బిజెపి మాత్రం తెలంగాణపై సవతి తల్లి ప్రేమను ఒలకబోస్తుందని అన్నారు. 16 స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్, బీహార్‌కు దక్కిన నిధులను చూసైనా కాంగ్రెస్, బిజెపి నాయకులు పార్టీ కతీతంగా కేంద్రంతో పోరాడి, తెలంగాణకు ఎక్కువ నిధులు తీసుకువచ్చి తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని అన్నారు.